# పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలి

**కలెక్టర్ నారాయణరెడ్డి**



ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి, నవంబర్ 21 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.1లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి శిక్షణ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు వహించాలని కలెక్టర్ సూచించారు. మాక్ పోలింగ్‌ను నిర్వహించిన తర్వాత అన్ని క్లియర్ చేసి పోలింగ్ చేపట్టాలని పేర్కొన్నారు. జడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మార్కెట్‌యార్డులో ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట పరిగి ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయకుమారి, మ్యాన్ పవర్ నోడల్ అధికారి దీపారెడ్డి, డీహెచ్ఎస్‌వో చక్రపాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆనందరావు పాల్గొన్నారు.



సీఎం ప్రసంగించే సభాస్థలాన్ని పరిశీలించి బందోబస్తు గురించి పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

## గట్టి బందోబస్తును ఏర్పాటు చేశాం : ఎస్పీ కోటిరెడ్డి

పరిగి టౌన్, నవంబర్ 21 : ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ సిబ్బంది కృషిచేయాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం పరిగిలో పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించి పలు సూచన, సలహాలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, కెమెరా, వీడియో కెమెరాలను తీసుకెళ్లకుండా చూడాలని సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించే ఫొటోలు, వీడియోలు, పుకార్లపై పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘాపెట్టాలని చెప్పారు. బుధవారం పరిగికి సీఎం కేసీఆర్ రానున్న నేపథ్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సీఎం హెలిప్యాడ్, బహిరంగ సభాస్థలిని పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ వెంకట్రామయ్య, ఎస్సై సత్యనారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీతో బీసీలకు అన్యాయమే..

**రోహిత్‌రెడ్డికే ముదిరాజ్, బీసీల మద్దతు**

**విలేకరుల సమావేశంలో ముదిరాజ్ మహాసభల జాతీయ కార్యదర్శి వీరేశ్**



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభల జాతీయ కార్యదర్శి వీరేశ్

తాండూరు, నవంబర్ 21: బీఆర్ఎస్ పాలనలో కులవృత్తులకు గౌరవం దక్కిందని ముదిరాజ్ మహాసభల జాతీయ కార్యదర్శి వీరేశ్ అన్నారు. మంగళవారం తాండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీరేశ్ మాట్లాడుతూ బీసీల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. మత్స్య, నేత, గీత, యాదవ, రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వకర్మ, అత్యంత వెనుకబడిన బీసీ వర్గాలను ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తాండూరు అభివృద్ధి ప్రదాత పంజుగుల రోహిత్‌రెడ్డికే ముదిరాజ్, బీసీల సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలనే న్యాయమైన డిమాండ్ సాధన కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌తో పాటు కుల గణన, జన గణన చేపట్టాలని బీజేపీ, కాంగ్రెస్‌లను కోరితే పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేయూతనిస్తుందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీతో బీసీలకు లాభం లేదన్నారు. ఆరవై ఏండ్లుగా ఏమీ చేయని కాంగ్రెస్, బీజేపీలు ఇప్పుడు బీసీలకు మేలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీ మంత్రిత్వ శాఖ పెట్టాలని డిమాండ్ చేశారు. తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి బీసీల డిమాండ్లను గుర్తించి సేవలు చేయడం అభినందనీయమన్నారు. తాండూరు పట్టణం రాజీవ్‌కాలనీ సమీపంలో 2 ఎకరాల స్థలంలో రూ.2 కోట్ల నిధులతో బీసీ సమీకృత భవన నిర్మాణం చేపట్టడం గొప్ప విషయమన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉమాశంకర్, బీసీ సంఘం తాండూరు నియోజకవర్గం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో ముందెన్నడూ లేని విధంగా తాండూరు అభివృద్ధికి, యువత సంక్షేమానికి కృషి చేస్తున్న తాండూరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. రోహిత్‌రెడ్డికి పార్టీలకతీతంగా ప్రచారం చేసి గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉన్నదన్నారు. బీసీలకు అండగా నిలిచిన ప్రభుత్వానికి ముదిరాజ్‌లు, బీసీలు అండగా నిలవాలని కోరారు.

# సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో**

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 21 : పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన వివిధ అంశాలకు సంబంధించిన నివేదికలను అందించాలని సూచించారు. 80ఏండ్లు పైబడిన వృద్ధులు, 40శాతానికిపైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు ఇద్ద వద్దనుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా చేపట్టిన ఏర్పాట్ల గురించి ఆయా జిల్లాల ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లు, పోలింగ్, కౌంటింగ్ కోసం చేపట్టిన కసరత్తుల గురించి ఆరా తీశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ చేయాలని, మిగిలిన పోలింగ్ కేంద్రాల బయట సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని సీఈవో సూచించారు. ఓటర్లకు పోస్టల్‌శాఖ ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తిచేసి, ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. నియోజకవర్గాల పరిధిలో ఈవీఎం యంత్రాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను తక్షణమే స్పందిస్తూ, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భారతీహోళీకేరి మాట్లాడుతూ..ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి హోమ్ ఓటింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్, జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు పాల్గొన్నారు.

# పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం

**మొదటిరోజు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్న పోలీసులు, సీనియర్ సిటిజన్స్**

**నేడు రెండోరోజూ కొనసాగనున్న పోలీసుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్**



యాచారంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్

ఇబ్రహీంపట్నం, నవంబర్ 21 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మంగళవారం నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు పోలీసు కానిస్టేబుళ్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, సీనియర్ సిటిజన్స్ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలీసు కానిస్టేబుళ్లు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మొత్తం 1214మంది ఉన్నారు. వీరి కోసం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. మొదటి రోజు మంగళవారం 343మంది పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలినవారి కోసం బుధవారం కూడా ఎంపీడీవో కార్యాలయంలోనే పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. మిగిలిన వారంతా తమ ఓటు హక్కును బుధవారం వేసుకోవాలని రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని సీనియర్ సిటిజన్స్ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కూడా ఎన్నికల కమిషన్ కల్పించింది. సీనియర్ సిటిజన్స్ తాము ఇంటి వద్ద నుంచే ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పించాలని నియోజకవర్గంలో మొత్తం 52 మంది దరఖాస్తు చేసుకోవటంతో వారికి ఈ అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులను వారి ఇంటివద్దకు తీసుకెళ్లి ఓటు వేయించారు. మంగళవారం 45మంది సీనియర్ సిటిజన్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, ఎన్నికల్లో విధులు నిర్వర్తించేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పోలింగ్ సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు శ్రీఇందు ఇంజినీరింగ్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఈ కళాశాలలో వీరు ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. 185మంది సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చును.

## తనిఖీల్లో మద్యం పట్టివేత

తలకొండపల్లి, నవంబర్ 21 : మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో రూ.19లక్షల30వేల విలువ చేసే మద్యం పట్టుకున్నట్లు ఎల్‌ఓన్ అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామంలో ఓ ఫామ్‌హౌజ్‌పై పోలీసులు దాడి చేసి 1762 లీటర్ల లిక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ రూ.19.30లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, యాదయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఆమనగల్లులో..**

ఆమనగల్లు : ఓ వాహనంలో మద్యం అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ బాల్‌రామ్ తెలిపిన వివరాల ప్రకారం ఓ వాహనంలో ఆమనగల్లు పోలీస్ సిబ్బంది, శంషాబాద్ ఎస్‌వోటీ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ చేపట్టగా మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కందుకూరు మండలం దెబ్బలగూడకు చెందిన డ్రైవర్ ఎండీ సలీమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## క్రీడారంగంలో గురుకుల బాలికల ప్రతిభ





విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి

మొయినాబాద్, నవంబర్ 21 : క్రీడారంగంలో గురుకుల పాఠశాల బాలికలు ప్రతిభను కనబర్చి పాఠశాలకు పతకాల పంట పండిస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు పతకాలను సాధించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 67వ ఎస్‌జీఎఫ్ రంగారెడ్డి జిల్లాస్థాయి టోర్నమెంట్ కామ్ సెలక్షన్ 2023-24 నిర్వహించారు. ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గురుకుల బాలికల పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో లాంగ్ జంప్, హై జంప్, అథ్లెటిక్స్ నిర్వహించారు. చేవెళ్ల గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి రక్షిత అండర్-17 విభాగంలో లాంగ్ జంప్‌లో పాల్గొని మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించారు. 7వ తరగతి విద్యార్థిని వైష్ణవి అండర్-14 విభాగంలో పాల్గొని అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో రెండవ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని, లాంగ్ జంప్‌లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను గురుకుల విద్యా సంస్థ ఆర్‌సీవో శారదావెంకటేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వారిని అభినందించారు.